క్లుప్తంగా

నగదు పట్టివేత



శాయంపేట : ఈ నెల 30వ తేదీన జరగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పరకాల, హనుమకొండ ప్రధాన రహదారి కొత్తగట్టుసింగారం వద్ద ఎస్సై దేవేందర్ శుక్రవారం వాహన తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో వరంగల్ పట్టణానికి చెందిన భూపతి సుధాకర్ కారులో లక్ష రూపాయాలు తీసుకొని హనుమకొండ నుంచి పరకాలకు వెళ్తున్నాడు. పోలీసులు వాహనాన్ని తనిఖీ చేయగా ఎన్నికల కోడ్‌కు విరుద్ధంగా ఆధారాలు లేకుండా లక్ష రూపాయలు తీసుకొని వెళ్తున్న కారణంగా సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు. ఈ డబ్బులను భూపాలపల్లి రిటర్నింగ్ అధికారికి అప్పగించినట్లు ఈ సందర్భంగా ఎస్సై పేర్కొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక



దామెర: మండల కేంద్రానికి చెందిన ప్రముఖ న్యాయవాది గంగిడి శ్రీధర్‌రెడ్డి, తక్కళ్లపహాడ్ సర్పంచ్ బింగి రాజేందర్‌తో పాటు వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు శుక్రవారం కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా పరకాల కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి రేవూరి ప్రకాష్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మన్నెం ప్రకాష్‌రెడ్డి, నాయకులు పాలెపాక శ్రీనివాస్, హింగె నాగేశ్వర్‌రావు, దుర్శెట్టి భిక్షపతి, బీరం సుధాకర్‌రెడ్డి, గుడిపాటి శ్రీధర్‌రెడ్డి, మాజీ సమితి చైర్మన్ రాజయ్య ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

దామెర: మండలంలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని ఏఈ గుర్రం రమేష్ తెలిపారు. దామెర, ఊరుగొండ సబ్‌స్టేషన్‌లో నెలవారీ మరమ్మతులు చేయనున్నందున ఉదయం 9.30 గంటల నుంచి 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.


హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 11న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీఎస్ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ సాంబరెడ్డి తెలిపారు. గోపాల్‌పూర్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు నక్కలగుట్ట సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 7.30గంటల నుంచి 9.30గంటల వరకు, బాలసముద్రం సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ నిలిపివేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

హసన్‌పర్తి: చింతగట్టు సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ ప్రదీప్‌కుమార్ తెలిపారు. కేసీ కాలనీ, నారాయణనగర్, ఎర్రగట్టు గుట్ట, కిట్స్ కళాశాల ప్రాంతం, హసన్‌పర్తి, రామారం, భీమారం, చింతగట్టు, కోమటిపల్లిల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని చెప్పారు. ఈక్రమంలో వినియోగదారులు సహకరించాలని ఈ సందర్భంగా ప్రదీప్‌కుమార్ కోరారు.

నేడు తాగునీటి సరఫరా బంద్

వరంగల్ అర్బన్: హనుమకొండ కాకతీయ యూనివర్సిటీ ప్రాంతంలో 800ఎంఎం డయా పైపులైన్ లీకేజీ కారణంగా కేయూసీ ఫిల్టర్ బెడ్ పరిధిలో శనివారం తాగునీటి సరఫరా నిలిపివేయనున్నట్లు బల్దియా డీఈ రవికుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. లీకేజీ మరమ్మతుల కారణంగా హనుమకొండ పరిధిలోని విద్యారణ్యపురి, కుమార్‌పల్లి, రెడ్డికాలనీ, రాయపుర, పద్మాక్షి కాలనీ, కాకతీయ కాలనీ, ముచ్చర్ల, పెగడపల్లి, భీమారం, చింతట్టు, వంగపహాడ్, గుండ్ల సింగారం, పలివేల్పుల ప్రాంతాల్లో ఒక రోజు నీటి సరఫరా ఉండదని తెలిపారు.

షార్ట్ సర్క్యూట్



దేశాయిపేట: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో నగరంలోని 12వ డివిజన్ దేశాయిపేట ఎస్సీ కాలనీకి చెందిన సిగ కరుణాకర్, సిగ జాన్సన్‌కు చెందిన రెండు ఇళ్లు శుక్రవారం దగ్ధమయ్యాయి. ఈమేరకు వరంగల్ అగ్నిమాపక కేంద్రం ఎల్ఎఫ్ ఎండీ.షఫిపాషా తెలిపారు. ప్రమాదంలో టీవీ, ఫ్రిడ్జ్‌లు కాలిపోగా, సుమారు రూ.2లక్షల వరకు ఆస్తినష్టం జరిగిందని పేర్కొన్నారు. ఫైర్‌సిబ్బంది ఆర్.శ్రీనివాస్, శివకృష్ణ, మహేష్ పాల్గొన్నట్లు తెలిపారు.

ఫోక్, డ్రామా పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

ఖిలా వరంగల్: కళా ఉత్సవ్ –2023 వరంగల్ జిల్లా స్థాయి పోటీల్లో జీహెచ్ఎస్ శంభునిపేట పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఫోక్ మ్యూజిక్ పోటీలకు పదో తరగతి విద్యార్థి వెంకటేష్, డ్రామా సోలో రాష్ట్ర స్థాయి పోటీలకు పదో తరగతి విద్యార్థి దినేష్ పోటీలకు ఎంపికయ్యారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి

- డీఆర్డీఓ శ్రీనివాసరావు



దామెర : ఓటు హక్కుపై ప్రతిజ్ఞ చేస్తున్న డీఆర్డీఓ, కూలీలు

దామెర: అర్హులైన ప్రతిఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని డీఆర్డీఓ శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని సింగరాజుపల్లి, తక్కళ్లపహాడ్, ఒగ్లాపూర్, దమ్మన్నపేట గ్రామాల్లో పర్యటించి ఉపాధిహామీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేసిన ఆయన కూలీలతో ఓటుహక్కుపై ప్రతిజ్ఞ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. పౌరులకు వజ్రాయుధం ఓటుహక్కు అన్నారు. పవిత్రమైన ఓటు హక్కును ప్రతిఒక్కరూ స్వచ్ఛందంగా వినియోగించుకోవాలని కోరారు. ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ప్రజాసేవా చేసే నాయకుణ్ణి ఎన్నుకోవాలని అన్నారు. 18 సంవత్సరాలు నిండిన యువతి, యువకులకు ఓటుహక్కు కల్పించడం జరిగిందని, ఓటు వేసేందుకు ఓటరు కార్డు, ఆధార్, డ్రైవింగ్ లైసెన్స్ ఏదేనా ఒక్కటి ఉన్నా సరిపోతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కాసర్ల రవీందర్, ఏపీఓ శారద, రజిత, కూలీలు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేయాలి

శాయంపేట : పోలింగ్ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని భూపాలపల్లి ఎన్నికల పరిశీలకుడు అభయ్‌నందన్ అభస్తా అన్నారు. శాయంపేట, పత్తిపాక, తహరాపూర్, కొత్తగట్టు సింగారం గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. ఓటర్లకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని అన్నారు. తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్, దివ్యాంగులకు ర్యాంపు సౌకర్యం ఏర్పటు చేయాలన్నారు. భూపాలపల్లి ఏడీఏ నర్సింగం, తహసీల్దార్ సుభాషిణిదేవి, ఎంపీడీఓ కృష్ణమూర్తి తదితరులు ఉన్నారు.



శాయంపేట : పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న ఎన్నికల అధికారి అభయ్‌నందన్ అభస్తా

అట్టహాసంగా దర్గా ఉత్సవాలు



జెండాను దర్గాకు తీసుకెళ్తున్న మత పెద్దలు

శాయంపేట : మండలంలోని మైలారం గ్రామ శివారులో గల కరిముల్లా సాబ్ దర్గా ఉత్సవాలు గురువారం రాత్రి అట్టహాసంగా జరిగాయి. గ్రామంలోని మహ్మద్ రఫీ ఇంటి నుంచి డప్పుచప్పుళ్ల మధ్య జెండాను దర్గా వద్దకు తీసుకెళ్లారు. ముస్లిం మత పెద్ద అబ్దుల్లా నేతృత్వంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రతి ఏడాది నవంబర్ 9వ తేదీన ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు అక్బర్ పాషా తెలిపారు. దర్గా ప్రాంతంలో విద్యుత్ దీపాలు, త్రాగునీటి సౌకర్యం లేకపోవడంతో జనరేటర్ సహాయంతో హైమాస్ట్ లైట్లు, మినరల్ వాటర్ సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి దర్గాకు వస్తున్న భక్తులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మత పెద్దలు రఫీ, యాకూబ్‌పాషా, అంకుష్, రహీం, దావత్, ఇస్మాయిల్ గ్రామస్తులు పాల్గొన్నారు.

మనస్తాపంతో విద్యార్థి ఆత్మహత్య



వంశీ(ఫైల్)

శాయంపేట: తండ్రి మందలించాడని ఓ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన హనుమకొండ జిల్లా శాయంపేట మండలంలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్సై దేవేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన వంశీ(17) విజయవాడలోని పాలిటెక్నిక్ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్నాడు. దసరా సెలవులకు ఇంటింటికి వచ్చి సెలవులు పూర్తియినప్పటికీ కళాశాలకు వెళ్లడానికి నిరాకరించాడు. దీంతో తండ్రి సంపత్ కాలేజీకి వెళ్లి చదువుకోమని ఉన్నత చదువులు చదివి ఉద్యోగం సంపాదించాలని నచ్చజెప్పాడు. తనకు చదువు అబ్బలేదని అంత దూరం వెళ్లి చదువుకోనని ఇక్కడే ఉంటానని వంశీ తండ్రికి చెప్పాడు. ఈక్రమంలో తల్లిదండ్రులు కళాశాలకు పంపుతారని మనస్తాపం చెంది క్షణికావేశంలో అక్టోబర్ 28న తెల్లవారుజామున 3గంటలకు పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం వంశీ మృతి చెందాడు. వంశీ తండ్రి సంపత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

'పీఎం శ్రీ' గా కేంద్రీయ విద్యాలయ



కాజీపేట అర్బన్: కాజీపేట మండలం కడిపికొండ గ్రామంలోని కేంద్రీయ విద్యాలయ వరంగల్‌ను పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయగా కేంద్ర విద్యాశాఖ మార్పు చేసింది. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన న్యూ ఎడ్యుకేషన్ –2020 పాలసీలో భాగంగా దేశవ్యాప్తంగా ఉన్న 535 కేవీ పాఠశాలలను పీఎం శ్రీ కేవీలుగా రూపాంతరం చేసేందుకు శ్రీకారం చుట్టగా అందులో కేవీ వరంగల్ చోటు దక్కించుకుంది. కేవీ వరంగల్‌ను పీఎం శ్రీ కేవీ వరంగల్‌గా మారుస్తూ శుక్రవారం ఏర్పాటు చేసిన పాఠశాల బోర్డును విద్యార్థులు ఆసక్తిగా గమనించారు. కేవీ వరంగల్‌కు తొలి విడతో రూ.20 లక్షల నిధులను కేంద్రం విడుదల చేసి, కేంద్ర కమిటీ 360 డిగ్రీల్లో డ్రోన్ ద్వారా పాఠశాల అభివృద్ధిపై పర్యవేక్షణ నిర్వహించనున్నట్లు సమాచారం.

కేడీసీ తెలుగు విభాగంలో వర్క్‌షాప్



వర్క్‌షాప్‌లో అధ్యాపకులు, అతిథులు, విద్యార్థులు

విద్యారణ్యపురి: హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక, కేడీసీ తెలుగు విభాగం సంయుక్త ఆధ్వర్యంలో ఈనాటి సందర్భాలు – ఆనాటి కథలు అనే అంశాలపై ప్రముఖ రచయిత కొడవటి కుటుంబరావు కథలను గ్రహించి విద్యార్థులతో శుక్రవారం కార్యశాల నిర్వహించారు. కేడీసీ తెలుగు విభాగం అధిపతి బాలయ్య అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ప్రిన్సిపాల్ డాక్టర్ రాజారెడ్డి, ప్రజా రచయిత్రుల వేదిక జాతీయ అధ్యక్షురాలు అనిశెట్టి రజిత, తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్యక్షురాలు డాక్టర్ తిరునగరి దేవకీదేవి, కేయూ రిటైర్డ్ ప్రొఫెసర్ కాత్యాయనీ విద్మహే, ప్రజాస్వామిక రచయిత్రల వేదిక జాతీయ కార్యదర్శి మల్లేశ్వరి, తదితరులు పాల్గొని మాట్లాడారు.

వేల మాటలను ఒక చిత్రం చెబుతుంది



చిత్రలేఖనం పోటీలో పాల్గొన్న విద్యార్థులు

కాజీపేట రూరల్: వేల మాటలను ఒక చిత్రలేఖనం చెబుతుందని పోటీల ఇన్‌చార్జ్ రెవరెండ్ బ్రదర్ బాలవినోద్ రెడ్డి అన్నారు. కాజీపేట సెయింట్ గ్యాబ్రియల్ హైస్కూల్‌లో విద్యార్థులకు శుక్రవారం చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రాబ్రియల్ ప్రిన్సిపాల్ బ్రదర్ ఆంటోని పాలిశెట్టి మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. అందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు వారిని ప్రోత్సాహించాలని కోరారు. చిత్రలేఖనం పోటీల్లో 20పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. విహార యాత్ర, ఇష్టమైన పండుగ, తుపాను విధ్వంసం అనే అంశాలను విద్యార్థులు చిత్రకళను ప్రదర్శించారు. అనంతరం విజేతల పేర్లను ఆయా పాఠశాలలకు పంపించనున్నారు. ప్రైమరీ స్కూల్ ప్రిన్సిపాల్ రెవరెండ్ బ్రదర్ స్లీవారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రైవేట్ వాహన డ్రైవర్లను ఆదుకోవాలి

హన్మకొండ: ప్రైవేట్ డ్రైవర్లను ఆదుకునేందుకు చేపట్టనున్న కార్యాచరణను బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీలు తమ ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇవ్వాలని ప్రజావేదిక రాష్ట్ర చైర్మన్ డాక్టర్ తిరునహరి శేషు అన్నారు. హనుమకొండ సుబేదారిలో ప్రజావేదిక, ప్రైవేట్ డ్రైవర్స్ అసోసియేషన్ సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా శేషు మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు, క్యాబ్, లారీ, ట్రక్, బస్ డ్రైవర్లను ఆదుకునేందుకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయడంతో పాటు వాహన బీమా, ప్రమాద బీమా, ఆరోగ్య బీమా సౌకర్యాలు కల్పించాలని కోరారు. సొంత వాహనదారులకు పన్నుల మినహాయింపు ఇచ్చేలా మేనిఫెస్టోలో చేర్చాలని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో వాహనమిత్ర పథకం ద్వారా ప్రతి సంవత్సరం రూ.10 వేలు అందిస్తున్నట్లుగానే తెలంగాణలో కూడా ప్రైవేట్ డ్రైవర్లకు ప్రభుత్వం ఆర్థిక సహకారం అందించాలని సూచించారు. కార్పొరేషన్ ఏర్పాటు చేసి రుణాలు కూడా అందించాలని కోరారు. సమావేశంలో ప్రైవేట్ డ్రైవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పవన్, రవి, నరేందర్ పాల్గొన్నారు.

ఎస్‌ఏ రైటింగ్‌లో మైరాకు బంగారు పతకం

రామన్నపేట: టాటా గ్రూపు ఆఫ్ కంపెనీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎస్‌ఏ రైటింగ్ జిల్లాస్థాయి పోటీల్లో మట్టెవాడలోని ఎస్సార్ డాటన్స్ పాఠశాలకు చెందిన అలీజ మైరా.. బంగారు పతకం సాధించింది. ఈ సందర్భంగా శుక్రవారం పాఠశాల ప్రిన్సిపాల్ తమిక హారక మాట్లాడుతూ ఎస్‌ఏ రైటింగ్ పోటీల్లో తమ పాఠశాలకు చెందిన 6వ తరగతి విద్యార్థిని మైరా.. బంగారు పతకం సాధించిందని తెలిపారు. ఈమేరకు హర్షం వ్యక్తం చేశారు.

నిరుపేదలకు నిత్యావసరాల పంపిణీ

మడికొండ: దీపావళి పండుగను పురస్కరించుకొని నిరుపేద కుటుంబాలకు మడికొండ పీఎస్ హెడ్ కానిస్టేబుల్ జయరాజ్ నిత్యావసర సరుకులను శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీపండుగకు పేదలకు నెలకు సరిపడా వస్తువులు అందజేస్తున్నట్లు తెలిపారు.

కళాఉత్సవ్‌లో స్నిగ్ధకు బహుమతి



హన్మకొండ కల్చరల్: విద్యార్థుల కళాప్రతిభను ప్రోత్సహించడానికి కేంద్ర విద్యాశాఖ, తెలంగాణ పాఠశాల విద్యాశాఖ మార్గదర్శకత్వంలో జిల్లా సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో హనుమకొండలోని ప్రాక్టీసింగ్ స్కూల్‌లో శుక్రవారం నిర్వహించిన జిల్లా స్థాయి కళాఉత్సవ్ –2023 పోటీల్లో హనుమకొండకు చెందిన స్నిగ్ధ సిరిమల్లి శాస్త్రీయ నృత్యవిభాగంలో ప్రథమ బహుమతి అందుకుంది. స్నిగ్ధ గత కొన్ని సంవత్సరాలుగా శ్రీశివానంద నృత్యమాల నృత్య కళాక్షేత్రం నిర్వాహకుడు, ప్రముఖ నృత్యగురువు బొంపెల్లి సుధీర్‌రావు వద్ద కూచిపూడి నృత్యంలో శిక్షణ పొందుతోంది.

పోక్సో కేసులో ఇద్దరు అరెస్ట్



కాజీపేట: బాలికను బెదిరించి అత్యాచారానికి ఒడిగట్టిన యువకుడితో పాటు అందుకు సహకరించిన లాడ్జి యజమానిపై పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ డేవిడ్‌రాజ్ తెలిపారు. కాజీపేట పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం రాత్రి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ మాట్లాడుతూ కాజీపేట 63వ డివిజన్ కూరగాయల మార్కెట్ ప్రాంతానికి చెందిన బొక్క అభిలాష్ అనే యువకుడు ఓ బాలికను బెదిరించి ద్విచక్ర వాహనంపై ఎక్కించుకుని హనుమకొండ కొత్త బస్టాండ్ ప్రాంతంలోని లాడ్జిలో బలవంతంగా అత్యాచారం చేశాడు. బాధితురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు అభిలాష్‌తో పాటు లాడ్జి ఓనర్ శ్రీరాముల వెంకటేశ్వర్లుపై కేసు నమోదు చేసి వారిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. సమావేశంలో ఇన్‌స్పెక్టర్ సార్ల రాజు, ఎస్సై లలిత పాల్గొన్నారు.

18కిలోల గంజాయి పట్టివేత

ఖిలా వరంగల్: ఒడిశా రాష్ట్రంలోని సంబల్‌పూర్ నుంచి రైలు మార్గం ద్వారా వరంగల్ మీదుగా మహారాష్ట్రలోని సోలాపూర్‌కు ఎండు గంజాయి తరలిస్తున్న ముగ్గురు అంతర్రాష్ట్ర గంజాయి స్మగ్లర్లను అరెస్ట్ చేసి వారి నుంచి రూ.4.50లక్షల విలువైన 18కిలోల ఎండు గంజాయి, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు.

దార్శనికుడు మౌలానా అబుల్ కలాం

కేయూ క్యాంపస్: గొప్ప దార్శనికుడు మౌలానా అబుల్ కలాం అని కాకతీయ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేష్ అన్నారు. క్యాంపస్‌లోని మౌలానా అబుల్ కలాం సెంటర్ ఫర్ మైనార్టీస్ ఎంపవర్‌మెంట్ సెల్ డైరెక్టర్ డాక్టర్ కనీజ్‌ఫాతిమా అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన మౌలానా అబుల్ కలాం జయంతి (ముందస్తు)సమావేశంలో వీసీ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ లాంటి జాతీయ సంస్థల స్థాపన కలాం చొరవేనని గుర్తుచేశారు. విద్యావ్యాప్తి ద్వారా సమాజం చైతన్యం, అభివృద్ధి జరుగుతుందని వివరించారు. విద్యను ప్రతీఒక్కరు హక్కుగా భావించాలన్నారు. విద్యార్థులు చదువుపై మక్కువ పెంచుకొని కష్టంతో పాటు ఇష్టపడి చదవాలని కోరారు. నేటి యువత మౌలానా అబుల్ కలాంను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. మంచి ర్యాంకులు సాధించి ఉన్నతంగా ఎదగాలని అన్నారు. కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ శ్రీనివాస్‌రావు, శాతవాహన యూనివర్సిటీ మాజీ వీసీ మహ్మద్ ఇక్బాల్‌అలీ, తదితరులు పాల్గొన్నారు.

ఓటేసి గెలిపించండి అభివృద్ధి చేస్తా..



భూపాలపల్లి రూరల్: కండువా కప్పి ఆహ్వానిస్తున్న చందుపట్ల కీర్తిరెడ్డి



మొగుళ్లపల్లి: ఓట్లను అభ్యర్థిస్తున్న చందుపట్ల కీర్తిరెడ్డి

- బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి చందుపట్ల కీర్తిరెడ్డి

భూపాలపల్లి రూరల్: మీ ఇంటి ఆడబిడ్డగా తనకు ఓటేసి గెలిపిస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తా అని బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి చందుపట్ల కీర్తిరెడ్డి అన్నారు. శుక్రవారం భూపాలపల్లి పట్టణంలోని 15వ వార్డు కాకతీయ కాలనీ, బ్యారెక్స్ ఎండీ క్వార్టర్స్‌లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆస్తులను కాపాడుకోవడానికి చేతిగుర్తు మీద గెలిచి కారులోకి పోయిన ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డికి ఓటుతో తగిన గుణపాఠం చెప్పాలన్నారు. గండ్ర సత్యనారాయణరావు ఎప్పుడు ఏ గుర్తుపై వస్తాడో అతనికే తెలవదని అన్నారు. కమలం పువ్వుకు ఓటేసి గెలిపిస్తే భూపాలపల్లికి ఇంజనీరింగ్ కాలేజీతో పాటు, రైల్వే కనెక్టివిటీ తెప్పిస్తామని హామీఇచ్చారు. పార్టీలో చేరిన కార్యకర్తలకు కండువాలు కప్పారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు యుగేందర్, అర్బన్ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, వార్డు ఇన్‌చార్జ్ రేగళ్ల రవీందర్, నాయకులు ఊనగొండ రామకృష్ణ, మండల రఘునాథ్‌రెడ్డి, తుమ్మేటి రాంరెడ్డి, కొరె సుధాకర్, కృష్ణకాంత్, ఊరటి మునీందర్, కరివేద మనోహర్, భాస్కర్, లోకేష్, బోరం రాజయ్య, రాజ్ కుమార్, మహిళా జిల్లా అధ్యక్షురాలు వేశాల సత్యవతి, తదితరులు పాలొన్నారు.

మొగుళ్లపల్లి: మండల కేంద్రంతో పాటు అంకుషాపూర్ గ్రామంలో బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి కీర్తిరెడ్డి ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను వివరించారు. అనంతరం అంకుషాపూర్ గ్రామాల యువకులు బీజేపీలో చేరగా వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సమావేశంలో బీజేపీ మండల అధ్యక్షుడు చెవ్వ శేషగిరి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చదువు రామచంద్రారెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ మోరె రవీందర్ రెడ్డి, అన్నం శ్రీనివాస్, దొంగల రాజయ్య, బండారి శ్రీనివాస్, మండల సోషల్ మీడియా కన్వీనర్ సురేష్ పాల్గొన్నారు.

కీర్తిరెడ్డిని అధిక మెజారిటీతో గెలిపించాలి

రేగొండ: బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి చందుపట్ల కీర్తిరెడ్డిని అధిక మెజారిటీతో గెలిపించాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు దాసరి తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో కొత్తపల్లిగోరి మండల కేంద్రంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

బాణసంచాతో పర్యావరణ కాలుష్యం



అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాల్ సంపత్‌కుమార్

కమలాపూర్: దీపావళి పండుగ సందర్భంగా బాణసంచా కాల్చడం పర్యావరణానికి హానికరమని, దీంతో అనారోగ్య సమస్యలు ఏర్పడుతాయని ప్రిన్సిపాల్ సంపత్‌కుమార్ అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో దీపావళి పండుగను పురస్కరించుకుని శుక్రవారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో బాణసంచా కాల్చడం వలన జరిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. బాణాసంచా కాల్చే సమయంలో చిన్న పిల్లలు, గర్భిణులు, వృద్ధులు దూరంగా ఉండాలని అన్నారు. వీలైనంత తక్కువగా బాణసంచా కాల్చి పర్యావరణాన్ని కాపాడుకోవాలని సూచించారు. దీపావళి సందర్భంగా సంప్రదాయ క్రాకర్స్‌కు బదులు గ్రీన్ క్రాకర్స్ కాల్చాలని, తద్వారా హానికర ప్రభావాల నుంచి మనతో పాటు పర్యావరణాన్ని రక్షించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీఓ రాజ్‌కుమార్, అధ్యాపకులు కవిత, సాంబశివయ్య, సురేష్‌బాబు, రాందాస్, కుమారస్వామి, శోభాదేవి, యామిని, శ్రీనివాస్, సంధ్యారాణి, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఓర్వలేక బీఆర్ఎస్‌పై పొన్నం విమర్శలు

- జెడ్పీ చైర్మన్ సుధీర్‌కుమార్



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ సుధీర్‌కుమార్

ఎల్కతుర్తి: హుస్నాబాద్‌లో జరిగిన అభివృద్ధిని చూసి ఓర్వలేక మాజీ ఎంపీ, ప్రస్తుత కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి పొన్నం ప్రభాకర్ బీఆర్ఎస్‌పై విమర్శలు చేయడం తగదని హనుమకొండ జెడ్పీ చైర్మన్ మారపల్లి సుధీర్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. పొన్నం అహంకారానికి ప్రజలే ఓటుతో తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. గౌరవెల్లి 1.14టీఎంసీలు ఉన్న ప్రాజెక్టును 8.23 టీఎంసీల ఎత్తుపెంచి 95శాతం పనులు పూర్తి చేశామని, అది కాంగ్రెస్‌కు కనిపించడం లేదా ప్రశ్నించారు. ఎమ్మెల్యే సతీష్‌కుమార్‌పై విమర్శలు చేసే అర్హత పొన్నంకు లేదన్నారు. అర్థరహితమైన విమర్శలు చేస్తే సహించేదిలేదన్నారు. ఈ సమావేశంలో ఎంపీపీ మేకల స్వప్న, సింగిల్‌విండో చైర్మన్ శ్రీపతి రవీందర్‌గౌడ్, మండల అధ్యక్షుడు గొడిశాల సమ్మయ్యగౌడ్, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు కడారి రాజు, నాయకులు శేషగిరి, గడ్డం రవి, లోకిని సూరయ్య, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ధన్వంతరి జయంతి



పూలమాల వేస్తున్న నాయీబ్రాహ్మణులు

కమలాపూర్: మండల కేంద్రంలో నాయీబ్రాహ్మణ సేవా సహకార సంఘం పట్టణ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం వైద్య నారాయణ ధన్వంతరి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య నారాయణ ధన్వంతరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నాయీబ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షుడు రవి, పట్టణ అధ్యక్షుడు మొగిలిచెర్ల రాంబాబు, ప్రధాన కార్యదర్శి, ఉపాధ్యక్షుడు మొగిలి, ప్రశాంత్, సహాయ కార్యదర్శి రాజు, కోశాధికారి శ్రీనివాస్, సహాయ కోశాధికారి కన్నయ్య, కార్యవర్గ సభ్యులు రాజేందర్, రాజేష్, అశోక్, మామునూరి అనిల్, గౌరవ అధ్యక్షుడు కుమారస్వామి, వీరస్వామి, సలహాదారులు వీరస్వామి, సాంబయ్య పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి సైన్స్ కాంగ్రెస్‌కు విద్యార్థుల ఎంపిక



ప్రశంసపత్రం అందజేస్తున్న డీఈఓ

దామెర: మండలంలోని ఒగ్లాపూర్ సమీపంలో గల డీస్నీల్యాండ్ పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి సైన్స్ కాంగ్రెస్‌కు ఎంపికైనట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్ శోభారాణి తెలిపారు. ఈనెల 9వ తేదీన హనుమకొండలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి బాలల సైన్స్‌ఫెయిర్ నిర్వహించారు. అందులో పాఠశాలకు చెందిన 7వ తరగతి విద్యార్థులు మాటూరి కీర్తి వరుణ్, మండల కార్తిక్ మ్యాన్ హోల్ డిటెక్టింగ్ సిస్టం అనే అంశంపై తయారు చేసిన ఎగ్జిబిట్ రాష్ట్రస్థాయి సైన్స్ కాంగ్రెస్‌కు ఎంపికైంది. దీంతో జిల్లా విద్యాధికారి అబ్దుల్‌హై చేతుల మీదుగా జ్ఞాపిక, ప్రశంసపత్రం అందుకున్నారు.